క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి

ఉరవకొండ: నియోజకవర్గానికి చెందిన పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను సోమవారం ఎమ్మెల్సీ స్వగ్రామం కొనకొండ్లలో ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పంపిణీ చేశారు. ఉరవకొండ మండలం వెలిగొండ గ్రామానికి చెందిన కుళాయిస్వామికి రూ.3లక్షలు, విడపనకల్లుకు చెందిన చిన్నవన్నూర్‌స్వామికి రూ.1.20 లక్షల విలువ చేసే చెక్కులను ఆయన అందజేశారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీ ద్వారా పేద ప్రజలకు అనేక వ్యాధులకు ఉచిత వైద్యం అందించే సదుపాయాన్ని కల్పించారన్నారు. ఆరోగ్యశ్రీ పరిధిలో లేని వ్యాధులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేస్తున్నామన్నారు కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ఎల్లమ్మ జలధి ఉత్సవం



అమ్మవారి విగ్రహాన్ని ఊరేగిస్తున్న దృశ్యం

బ్రహ్మసముద్రం: మండలంలోని గొంచిరెడ్డిపల్లిలో రేణుక ఎల్లమ్మ దేవికి సోమవారం జలధి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ముప్పలకుంట గ్రామ సమీపంలోని వంకలో మేళవాయిద్యాలు, ఉరుముల ఊరేగింపుతో వెళ్లి అమ్మవారికి గణపతి పూజ (గంగ పూజ) జలధి పూజ చేపట్టారు. అనంతరం అమ్మవారి విగ్రహాన్ని గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

విద్యుత్ సమస్య పరిష్కరించాలి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని 26, 27వ వార్డుల్లో నెలకొన్న హై, లో ఓల్టేజీ సమస్యలను పరిష్కరించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. ఈ మేరకు 26వ వార్డు కౌన్సిలర్ ఫక్రుద్దీన్, 27వ వార్డు ఇన్‌చార్జ్ నిజాముద్దీన్‌తో కలసి కాలనీవాసులు సోమవారం ట్రాన్స్‌కో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. దాదాపు ఐదారు నెలల నుంచి ఓల్టేజీ సమస్యతో ఇంట్లో విద్యుత్, గృహ పరికరాలు కాలిపోయి నష్టపోతున్నామన్నారు. అధికారులు స్పందించి ఆత్మకూరు వీధి పిండి మిషన్ వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించి కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలని వారు డిమాండ్ చేశారు.

కమనీయం.. సంగమేశ్వరుడి కల్యాణం



శివపార్వతులకు కల్యాణం జరిపిస్తున్న పురోహితులు

కూడేరు: వజ్రకరూరు మండల గంజికుంట గ్రామానికి చెందిన లక్ష్మి ,నాగేశ్వర రావు దంపతులు సోమవారం కూడేరులో ప్రసిద్ధిగాంచిన శివపార్వతుల జోడు లింగాల ఆలయంలో ఉత్సవ విగ్రహాలకు కల్యాణం జరిపించారు. తొలుత ఉత్సవ విగ్రహాలను అర్చకుడు మహేష్ ఇంటి దగ్గర నుంచి పల్లకీలో మంగళ వాయిద్యాల నడుమ సంగమేశ్వర ఆలయం వరకూ తీసుకు చ్చారు. అనంతరం పురోహితులు సురేష్‌శాస్త్రి, ప్రవీణ్ స్వామి, మహేష్ స్వామి మంత్రోచ్చారణల నడుమ శివపార్వతుల విగ్రహాలకు కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు హాజరై మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు.

ఘనంగా మహా చండీ హోమం



చండీ హోమం నిర్వహిస్తున్న దృశ్యం

ఉరవకొండ: స్థానిక గుంతకల్లు రోడ్డులోని జగదీశ్వరీ అమ్మవారి ఆలయంలో లోక కల్యాణార్థం సోమవారం మహా చండీహోమం నిర్వహించారు. వేదపండితుల మధ్య ఆలయ ధర్మకర్త గాజుల శ్యామలమ్మ ఆధ్వర్యంలో హోమాలు చేపట్టారు. పాక్షిక చంద్రగ్రహణం అనంతరం ఆలయంలో మహా సంప్రోక్షణ కార్యక్రమాలు ముగిసిన తరువాత అమ్మవారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల ఆధ్వర్యంలో మహా చండీహోమం ఏర్పాటు చేశారు. సకాలంలో వర్షాలు కురిసి పంటలు చేతికందాలని రైతులు, ప్రజలు సుభిక్షంగా ఉండాలని వేద పండితులు ఆకాంక్షించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

నిరుపేదల కల సాకారం

- పండుగ వాతావరణంలో లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు
- టీడీపీ హయాంలో నకిలీ పట్టాలతో మోసగించిన పయ్యావుల
- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వ



భారీగా తరలివచ్చిన లబ్ధిదారులు

ఉరవకొండ: 'ఓటు బ్యాంక్ కోసం నకిలీ పట్టాలు మంజూరు చేసి మోసపుచ్చిన నీచమైన చరిత్ర పయ్యావుల కేశవ్‌ది. 15 ఏళ్ల నా పోరాటానికి ఫలితం దక్కింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో పేదల సొంతింటి కల సాకారం చేయడం ఎంతో సంతృప్తినిస్తోంది' అంటూ ఉరవకొండ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వర రెడ్డి అన్నారు. సోమవారం ఉరవకొండలోని కొలిమి లేవుట్ కాలనీ వద్ద కోర్టు వివాదం నుంచి క్లియరెన్స్ పొందిన సర్వే నంబర్ 589–5లో 255 మంది లబ్ధిదారులకు ప్లాట్ల కేటాయింపు కార్యక్రమం ప్రారంభమైంది. లబ్ధిదారులకు మాజీ ఎమ్మెల్యే విశ్వ ఇచ్చిన మాట ప్రకారం ఈ నెల 30న ఒక్క రోజు ఆలస్యం లేకుండా లేవుట్ స్థలంలో ముళ్ల పొదలు తొలగించి, ప్లాట్లకు నంబర్ రాళ్లు పాతించారు. పండుగ వాతావరణం మధ్య లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ... లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్లాట్లతో పాటు వారికి ప్రభుత్వం తరపున పక్కా గృహ నిర్మాణాలు చేయించి ఇస్తామన్నారు. ఈ ప్రక్రియను అధికారులతో పాటు ఎంపీపీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వార్డు సభ్యులు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు పర్యవేక్షిస్తారన్నారు. రాయంపల్లి లేఅవుట్‌కు సంబంధించి నవంబర్ 2 నుంచి లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ హరిప్రసాద్, మండల సర్వేయర్ రత్నాకర్, సీనియర్ అసిస్టెంట్ వంశీకృష్ణ, ఎంపీపీ చంద్రమ్మ, వైస్ ఎంపీపీ నరసింహులు, .జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, సర్పంచ్ లలితమ్మ, ఉప సర్పంచ్ వన్నప్ప. కురుబ, ఎంబీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, పట్టణ వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ఏసీ ఎర్రిస్వామి, మండల సమన్వయకర్త ఓబన్న, పంచాయతీ రాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలన సువర్ణాధ్యాయం

- చరిత్రలో నిలిచిపోయేలా 'జగనన్న ఆరోగ్య సురక్ష'
- ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి



మెడికల్ కిట్ అందజేస్తున్న ప్రభుత్వ విప్ కాపు

రాయదుర్గంటౌన్: విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సువర్ణాధ్యాయంలా కొనసాగుతోందని ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి అన్నారు. అభివృద్ధి, సంక్షేమంతో అత్యుత్తమ పాలన అందజేస్తున్న జగనన్నకు ప్రజలు అండగా నిలువాలన్నారు. పట్టణంలోని 16వ సచివాలయం పరిధిలోని 28, 29 వార్డులకు బళ్లారి రోడ్డు హెచ్‌పీ పెట్రోల్ బంక్ పక్కన గల డీఆర్‌ఎల్ భవనంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డి, కమిషనర్ దివాకర్‌రెడ్డి, వైస్ చైర్మన్ వలి బాషా, 28వ వార్డు కౌన్సిలర్ పొరాళ్ల గోవిందరాజులు, 29వ వార్డు ఇన్‌చార్జ్ వైజాగ్ రిబ్కాతో కలిసి విప్ ప్రారంభించారు. స్పెషలిస్టు వైద్యుల పర్యవేక్షణలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను ఆయన పరిశీలించారు. విప్ మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష క్యాంపులతో ప్రాథమిక దశలోనే సమస్యలను గుర్తిస్తూ ఆరోగ్యశ్రీతో కార్పొరేట్ వైద్యం అందించే ప్రక్రియ జరుగుతోందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎం అయ్యాక అన్ని వర్గాలకూ అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అందుతున్నాయన్నారు.

అవినీతి వీరుడు 'చంద్రబాబు'

30 ఏళ్లుగా ప్రజలను మోసం చేస్తూ వచ్చిన ఘన చరిత్ర గలిగిన అవినీతి వీరుడు మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబు అని విప్ ఘాటుగా విమర్శించారు. స్కాములు చేసి ఆధారాలతో దొరికిన దొంగ కాబట్టే జైల్లో ఉన్నాడని, నిరూపించుకునే అవకాశం లేకపోవడంతోనే చంద్రబాబు తన సతీమణి నారా భువనేశ్వరితో 'నిజం గెలవాలి' పేరుతో యాత్ర చేయిస్తున్నాడని విమర్శించారు. అవినీతికి పాల్పడి బాబు జైలుకు పోతే సానుభూతి కోసం టీడీపీ డ్రామాలకు తెర తీసిందన్నారు. చంద్రబాబుకు ఐదేళ్లు అవకాశం ఇస్తే ప్రజలకు ఏం చేశాడో చెప్పుకునేందుకు ఒక్క పథకమైనా ఉందా అని ప్రజలు ఆలోచించుకోవాలన్నారు. కేవలం ప్రజల సంక్షేమం కోసం పరితపిస్తున్న నేత వైఎస్ జగన్ అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ అరవా శివప్ప, కౌన్సిలర్లు గౌని లావణ్య, దేవరాజు, శివపుత్ర, ఫకృద్దీన్, తట్టే మంజునాథ, శ్రీనివాసరెడ్డి, వార్డు ఇన్‌చార్జ్‌లు పొరాళ్ల శివకుమార్, వైజాగ్ రవి, భీమనపల్లి దివాకర్, గోల్డ్ ఇస్మాయిల్, గోరంట్ల సత్యనారాయణ, స్టోర్ కృష్ణమూర్తి, దస్తగిరి, వంశీ, రఫీక్, రామకృష్ణ, స్పెషలిస్ట్ వైద్యులు ఉమామేశ్వర్, ప్రతిభ, అజహర్‌ఖాన్, మనోజ్‌కుమార్, మొమిన్ ఇబ్రహీం, పాల్గొన్నారు.

ఈ టైమ్‌లో నేను చూడను..!

- రోగుల పట్ల డాక్టర్ అనుచిత ప్రవర్తన
- సోషల్ మీడియాలో హల్‌చల్

కణేకల్లు: ఓ చిన్నారి తీవ్రమైన జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతుంటే తట్టుకోలేని తల్లిదండ్రులు చికిత్స కోసం కణేకల్లు సీహెచ్‌సీ కొస్తే.... ఈ టైమ్‌లో నేను చూడను... ఇదీ ఓపీ టైమ్ అనుకుంటున్నావా? ఎమర్జెన్సీ కేసులు మాత్రమే చూస్తా... వెళ్లిపోండంటూ ఓ మహిళా డాక్టర్ దబాయించిన ఘటన కణేకల్లులో చోటు చేసుకొంది. చిన్నారి జబ్బుతో బాధపడుతుంటే ట్రీట్మెంట్ చేయాల్సిన డాక్టర్ రూల్స్ గురించి మాట్లాడి చివరికి వెనక్కి పంపడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. కణేకల్లు సీహెచ్‌సీ (సామాజిక ఆరోగ్య కేంద్రం) 24 గంటల ఆసుపత్రి. ఉదయం... సాయంత్రం డాక్టర్లు ఓపీ సేవలందిస్తారు. ఆ తర్వాత సమయాల్లో విధులు నిర్వహించే డాక్టర్లు అత్యవసరంగా ఎవరొచ్చినా వైద్యసేవలందించాల్సి ఉంది. ఐతే ఇటీవల కణేకల్లు ఆస్పత్రిలో డాక్టర్ల తీరు తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. ఆదివారం రాత్రి 7.45 గంటల సమయంలో కణేకల్లుకు చెందిన అఫ్జల్, సల్మా దంపతులు తమ 18 నెలల కుమారుడైన ఆహిల్‌ను తీసుకొని ఆసుపత్రికొచ్చారు. తమ అబ్బాయి తీవ్రమైన జ్వరం, జలుబు, దగ్గుతో బాధపడుతున్నాడని చూడమని డ్యూటీలో ఉన్న డాక్టర్ పావనిని విన్నవించారు. మీరు ఎప్పుడంటే అప్పుడొస్తే నేను చూడని డాక్టర్ వారిపై మండిపడ్డారు. ఓపీ కోసం ఓ సమయమంటూ ఉంది.. అప్పుడే రావాలని వారిని దబాయించారు. ఎలాగైనా మా అబ్బాయిని చూడమని ప్రాధేయపడినా డాక్టర్ ససేమీరా అన్నారు. ఎట్టకేలకు వారిని చూడకుండా వెనక్కి పంపారు. దీంతో వారు మరో డాక్టర్‌తో తమ అబ్బాయికి వైద్యం చేయించుకున్నారు. ఈ ఘటన సోషల్ మీడియాలో వైరల్ అవుతుండటంతో డాక్టర్ల తీరు చూసి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా అధికారులు స్పందించి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా, ప్రజలకు వైద్యసేవలు సక్రమంగా అందేలా చూడాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆయుష్మాన్ భారత్ విజయవంతం చేయాలి

గుమ్మఘట్ట: కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్‌ను విజయవంతం చేయాలని ఎంపీడీఓ నరసింహమూర్తి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏఎన్‌ఎంలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ కార్డు కలిగిన వారికి ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.5 లక్షల వరకూ ఉచితంగా చికిత్స చేయించుకోవచ్చన్నారు. ఒక కుటుంబానికి ఒక కార్డును అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాంకిషోర్, సీహెచ్‌ఓ మురళీధర్, సూపర్‌వైజర్ ఆదిబయమ్మ తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయంపై శిక్షణ

కుందుర్పి: సేంద్రియ వ్యవసాయమే శ్రేయస్కరమని ఏఓ మహేష్, ఆర్డీటీ ఎకాలజీ కోఆర్డినేటర్ ఎర్రిస్వామి రెడ్డి, క్లస్టర్ కోఆర్డినేటర్ మల్లేసి సూచించారు. సేంద్రియ వ్యవసాయ పద్ధతుల ద్వారా మలయనూరు, కుందుర్పి, మహంతపురం, నిజవళ్లి తదితర పంచాయతీల్లో వివిధ రకాల పంటలు సాగు చేసి రైతులు మంచి దిగుబడులు సాధిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఏపీసీఎన్‌ఎఫ్ యాంకర్ రమేష్, రైతులు పాల్గొన్నారు.

నిండుకుండలా సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు



సమ్మర్ స్టోరేజ్ నీటి మట్టాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు: విడపనకల్లు సత్యసాయి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిండు కుండలా నీటితో కళకళాడుతోంది. అతి తక్కువ సమయంలో సమ్మర్ స్టోరేజ్ లోకి పెద్దఎత్తున నీటిని పంపింగ్ చేసి నింపిన అధికారులు, కాంట్రాక్టర్లను మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ప్రశంసించారు. సోమవారం విడపనకల్లులో సత్యసాయి సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును ప్రజాప్రతినిధులు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో కలసి ఆయన పరిశీలించారు. వర్షాభావ పరిస్థితుల వల్ల తుంగభద్ర కాలువ నుంచి త్వరలో హెచ్చెల్సీకి నీరు బంద్ అయ్యే సూచనలు ఉన్నాయన్నారు. విడపనకల్లు సత్యసాయి సమ్మర్ స్టోరేజ్ కింద సరఫరా చేస్తూ ఎనిమిది గ్రామాల ప్రజలకు రాబోయే రోజుల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా యుద్ధ ప్రతిపాదికన ట్యాంకును నీటితో నింపాలని విశ్వేశ్వరరెడ్డి అధికారులకు, కాంట్రాక్టర్లకు గతంలో ఆదేశించారు. అధికారులు, కాంట్రాక్టర్లు విద్యుత్ మోటార్లు, ట్రాక్టర్ల సాయంతో అక్టోబర్ నెలాఖరులోపే ట్యాంకును పూర్తి స్థాయిలో నింపడం ఆనందంగా ఉందని, ఇదొక రికార్డు అని విశ్వేశ్వరరెడ్డి అన్నారు. అనంతరం అధికారులు, కాంట్రాక్టర్ గోపాలకృష్ణను సత్కరించారు. అంతకుముందు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, మండల ప్రజా ప్రతినిధులతో కలసి మాజీ ఎమ్మెల్యే గంగ పూజ చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ అంజుమన్ షఫ్రీన్, ఏఈ ధనుంజయ, జెడ్పీటీసీ హనుమంతు, ఎంపీపీ కరణం పుష్పావతి, పార్టీ మండల కన్వీనర్ బసన్న, బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్, జెడ్పీ మాజీ సభ్యుడు తిప్పయ్య, నాయకులు బి.సుంకన్న, గిరిబాబు, భీంరెడ్డి, సర్పంచులు మోదుపల్లి రామాంజనేయులు, దాసి వెంకటేశులు, కో ఆప్షన్ సభ్యులు లతీఫ్, తిమ్మరాజు, మహేశ్, వీరప్ప, ఎర్రిస్వామి, రామన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

సాయిబాబా మందిరంలో చోరీ

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్ గ్రామ శివారులో వేదావతి హగరి నది ఒడ్డున ఉన్న షిర్డీ సాయిబాబా మందిరంలో హుండీ ధ్వంసం చేసి నగదు దోచుకెళుతున్న ఘటన సీసీ కెమెరాలో రికార్డయ్యింది. మందిరం చైర్మన్ లాలుసాబ్, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు ..సాయిబాబా మందిరంలో వరుసగా దొంగతనాలు చోటు చేసుకుంటున్నాయని, ఏడాదిలో ఇది నాలుగోసారన్నారు. ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి తలుపు తాళాలు పగులగొట్టి మందిరంలో ఉన్న హుండీని ధ్వంసం చేసి అందులో ఉన్న నగదును దోచుకెళ్లినట్లు తెలిపారు. దాదాపు రూ. 15 వేల వరకు ఉంటుందని వారన్నారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి అనంతపురం నుంచి క్లూస్ టీంను రప్పించి ఆధారాలను సేకరిస్తున్నారు. ఆలయ కమిటీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఎంపీటీసీకి గాయాలు

డి హీరేహాళ్(రాయదుర్గం): డి హీరేహాళ్ మండలంలోని హిర్దేహాళ్ వద్ద ఆటో బోల్తాపడిన ఘటనలో వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీ సూజి మహేష్ తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు..ఆయన సొంత ఆటోలో వెళ్తుండగా ప్రమాదవశాత్తు బోల్తా పడింది. తీవ్రంగా గాయపడిన అతడిని బంధువులు బళ్లారి విమ్స్‌లో చేర్పించారు. విషయం తెలుసుకున్న విప్ దంపతులు కాపు రామచంద్రారెడ్డి, భారతి ఫోన్‌లో పరామర్శించారు. సోమవారం ఎంపీపీ ఎం.పవిత్ర, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎమ్ వన్నూర్‌స్వామి తదితరులు ఎంపీటీసీని ఆస్పత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

యువతి అదృశ్యం



సౌమ్య(ఫైల్)

శెట్టూరు: మండలంలోని కైరేవు గ్రామానికి చెందిన యువతి కమ్మర సౌమ్య(19) కన్పించడంలేదంటూ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. శుక్రవారం అర్ధరాత్రి నుంచి సౌమ్య ఇంట్లో కన్పించడంలేదనితండ్రి మల్లికార్జున వాపోయాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ యువరాజ్ తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

కళ్యాణదుర్గం: పట్టణ సమీపంలోని బ్రహ్మయ్య స్వామి గుడి సమీపంలో సోమవారం కారు– బైకు ఢీకొన్నాయి. ఘటనలో ఒకరు గాయపడ్డారు. వివరాలు.. కర్ణాటకకు చెందిన సందీష్ తన పిన్నమ్మతో కలిసి ద్విచక్రవాహనంలో యర్రంపల్లి వైపు నుంచి కళ్యాణదుర్గం వైపు వస్తున్నాడు. బ్రహ్మయ్య స్వామి గుడి రింగ్ రోడ్ సర్కిల్ వద్దకు రాగానే అనంతపురం వైపు వెళ్తున్న కారును ఢీ కొన్నాడు. ప్రమాదంలో సందీష్‌కు గాయాలయ్యాయి. స్థానికులు హుటాహుటిన కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. అలాగే కళ్యాణదుర్గం వైపు నుంచి కుర్లపల్లికి వెళ్తున్న ఆటోలో నుంచి కుర్లపల్లికి చెందిన వశికేరప్ప అదుపు తప్పి కిందపడ్డాడు. గాయపడిన అతడని తోటి ప్రయాణికులు వెంటనే వశికేరప్పను కళ్యాణదుర్గం ఆసుపత్రికి తీసుకెళ్లారు. తలకు బలమైన గాయాలు కావడంతో ప్రథమ చికిత్స అనంతరం వశికేరప్పను మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

3 నుంచి కర్నూలులో 'ఫిష్ ఫుడ్ ఫెస్టివల్'

కూడేరు: రాష్ట్ర ప్రభుత్వం చేపల వినియోగ రేటును పెంచాలన్న ఉద్దేశంతో కర్నూలులోని రావూరి గార్డెన్‌లో నవంబర్ 3,4,5 తేదీల్లో ప్రాన్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను నిర్వహిస్తోందని ఎఫ్‌డీఓ(పీఏబీఆర్ డ్యాం) బాబు నాయక్ అన్నారు. సోమవారం కూడేరులోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ నారాయణ రెడ్డి చేతుల మీదుగా ప్రాన్ అండ్ ఫిష్ ఫుడ్ ఫెస్టివల్ పోస్టర్లను మత్స్యశాఖ అధికారులు విడుదల చేయించారు. ఎంపీపీ , ఎఫ్‌డీఓ మాట్లాడుతూ రాయలసీమలో మొట్ట మొదటిసారిగా ఈ ఫెస్టివల్ నిర్వహిస్తున్నారన్నారు. మత్స్యకారుల ఆదాయాన్ని పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. ఫుడ్‌ఫెస్టివల్‌కు మండలం నుంచి మత్స్యకారులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంకేబాషా, ఏఓ నాగభూషణరెడ్డి,వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ బైరెడ్డి రామచంద్రారెడ్డి, సర్పంచ్ హనుమంత రెడ్డి , పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ఉద్యమిద్దాం

వజ్రకరూరు: పరిసరాల పరిశుభ్రతకు ఉద్యమిద్దామంటూ డీజీసీఓ డైరెక్టర్ (ఢిల్లీ) డాక్టర్ ప్రవీణ్ పంకజ్, ఏపీ యూనిట్ డైరెక్టర్ డాక్టర్ అపూర్వబెనర్జీ పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆదేశాలకు అనుగుణంగా ఏపీ దక్షిణ ప్రాంత జియాలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, హైదరాబాద్ అడిషినల్ డైరెక్టర్ జనరల్ సీహెచ్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ లలన్ ప్రసాద్‌సింగ్ ఆధ్వర్యంలో సోమవారం వజ్రకరూరులోని వజ్రాల ప్రక్రమణ కేంద్రం (జీఎస్‌ఐ)లో స్వచ్ఛభారత్ – స్వస్థ్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా డాక్టర్ ప్రవీణ్ పంకజ్, డాక్టర్ అపూర్వ బెనర్జీతో పాటు డైరెక్టర్లు వి.బాలచంద్రుడు, ఎం.ఎ.ఖొంగ్లా (నోడల్‌ఆఫీసర్), రాకేష్ కుమార్‌గుప్త (హెచ్‌ఓ), అసిస్టెంట్ జియాలజిస్ట్ హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు పాటు పడాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు స్వచ్ఛతా కిట్లు అందజేశారు. జీఎస్‌ఐలోని పలు ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టారు. అనంతరం విద్యార్థులతో కలసి గ్రామ సమీపంలోని కింబర్‌లైట్‌పైప్(1) ఫీల్డ్ అవుట్ క్రాస్ వరకూ 2కి నడక నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ మోనాలిసా, జెడ్పీహెచ్‌ఎస్ హెచ్‌ఎం స్వర్ణలత, పంచాయతీ కార్యదర్శి శ్రీధరరావు, పాల్గొన్నారు.

ఎక్కువ నీటి అవసరమున్న పంటలు సాగుచేయొద్దు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఇరిగేషన్ అధికారులు

కూడేరు: పీఏబీఆర్ జలాశయంలో నీటి నిల్వ తక్కువగా ఉన్నందున.. డ్యాం పరిసర ప్రాంతాల్లోని రైతులు రబీలో ఎక్కువ నీటి అవసరమున్న పంటలు సాగు చేసి నష్ట పోవద్దని ఇరిగేషన్ జేఈఏలు లక్ష్మీదేవి, గంగమ్మ, రేణుక సూచించారు. సోమవారం వారు మండలంలోని జయపురం, కొర్రకోడు, ఎంఎంహళ్లి రైతులతో సమావేశమై అవగాహన కల్పించారు. మరికొద్ది రోజుల్లో తుంగభద్ర డ్యాం నుంచి హెచ్చెల్సీ ద్వారా సరఫరావుతున్న నీరు బంద్ అవుతుందన్నారు. డ్యాంలో ఉండే తక్కువ నీటిని జలాశం వద్ద ఏర్పాటు చేసిన తాగునీటి ప్రాజెక్టులకు సరఫరా చేసేందుకు నిల్వ ఉంచుతామన్నారు. మిడ్‌పెన్నార్‌కు ఎక్కువగా నీటిని విడుదల చేసే బదులు పీఏబీఆర్‌లోకి నీటిని ఎక్కువగా సరఫరా చేసి ఉంటే పంటలు సాగు చేసుకునేందుకు వీలుండేదని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.

మండల సమావేశం రేపు

కళ్యాణదుర్గం రూరల్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాధరణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపీపీ మారుతమ్మ అధ్యక్షత వహించనున్నారు. జెడ్పీటీసీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల కన్వీనర్, నాయకులు, కో–ఆప్షన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

బొమ్మనహాళ్: మండలంలోని బండూరు గ్రామానికి చెందిన వన్నూరుస్వామి నుంచి కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు బొమ్మనహాళ్ ఎస్‌ఐ శివ తెలిపారు. ఆదివారం రాత్రి బళ్లారి నుంచి అతడు టెట్రా ప్యాకెట్లు తీసుకొస్తుండగా చెక్ పోస్టు వద్ద తనిఖీ చేసి, 120 (90 ఎంఎల్) టెట్రా ప్యాకెట్లతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించామన్నారు.

బదిలీ పోలీసులకు సన్మానం

బొకుప్ప: ఇటీవల బదిలీ అయిన ఐదుగురు పోలీసులకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఐ హెడ్ కానిస్టేబుల్ గంగన్న రాయదుర్గం స్టేషన్‌కు, కానిస్టేబుల్స్ విజయ్‌కుమార్ వజ్రకరూరుకు, కాశింవలి ఆత్మకూరుకు, పవన్‌కుమార్ కంబదూరుకు, పద్మ బ్రహ్మసముద్రం పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. వారిని ఏఎస్‌ఐ రామదాసు ఆధ్వర్యంలో హెడ్ కానిస్టేబుల్ నరసింహులు, పోలీసులు నాగరాజు రాజునాయక్ సన్మానించారు.

'మా భూములు తీసుకోవద్దు'

రాయదుర్గం రూరల్: పరిశ్రమలకు మా భూములు తీసుకోవద్దని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో తహసీల్దార్ ఓబుళేసుకు సుమారు 30 మంది రైతులు విన్నవించారు. అసైన్డ్ భూములైనా గత 30, 40 ఏళ్లుగా సాగులో ఉన్నామన్నారు. జీవనాధారమైన భూములిచ్చి మేము ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు. అధికారులు స్పందించి భూములివ్వమని ఒత్తిడి చేయొద్దని వేడుకున్నారు.

సంక్షిప్త సమాచారం

వాల్మీకులు అన్ని రంగాల్లో ముందుకెళ్లాలి



బోనాలతో ఊరేగింపుగా వెళ్తున్న మహిళలు

కంబదూరు: వాల్మీకులు చైతన్యవంతులై అన్ని రంగాల్లోనూ ముందుకెళ్లాలని వాల్మీకి సంఘం యువ నాయకుడు గొట్లూరు చంద్ర పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని చెన్నంపల్లిలో వాల్మీకి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్మీకి మహిళలు బోనాలను ఉరేగింపుగా తీసుకెళ్లి వాల్మీకికి సమర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నరేంద్ర, వాల్మీకి యువత పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

కంబదూరు: బాల్య వివాహాలను అరికట్టి.. ఆడబిడ్డలను కాపాడుకుందామని సీడీపీఓ వనజ అక్కమ్మ పిలుపునిచ్చారు.సోమవారం మండలంలోని నూతిమడుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆర్డీటీ, మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆర్డీటీ సెక్టార్ టీం లీడర్ ఆదినారాయణ, డాక్టర్ ప్రసన్నకుమార్, ఎంఎల్‌హెచ్‌పీ ఎర్రిస్వామినాయక్, వీఆర్‌ఓ రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది శ్రీలత, ప్రధానోపాధ్యాయుడు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నివాళి

రాయదుర్గం రూరల్: మండలంలోని 74 ఉడేగోళం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తిప్పేస్వామి సోదరుడు, వైఎస్సార్‌సీపీ కార్యకర్త తిప్పేరుద్ర సోమవారం అనారోగ్యంతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి గ్రామానికి వెళ్లి రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డితో కలసి మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అండగా ఉంటామని కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్ సర్పంచ్ ఆంజనేయులు, నాయకులు ఉలుగప్ప, హనుమంతరాయుడు పాల్గొన్నారు.

క్రీడా సామగ్రి పంపిణీ

కుందుర్పి: మండలంలోని మాయదార్లపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడా పరికరాలను సర్పంచ్ మమత, స్టేట్ ఎంప్లాయిస్ అసోషియేషన్ అధ్యక్షుడు విజయభాస్కర్ పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు అందిస్తున్న క్రీడా పరికరాలు ఎంతో ఉపయోగకరమైనవన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ థ్యాంక్యూ సీఎం సార్ అంటూ నినదించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

'స్పందన' అర్జీలపై తక్షణమే స్పందించండి

కళ్యాణదుర్గం: 'స్పందన' అర్జీలపై ఆయా శాఖల అధికారులు తక్షణమే స్పందించాలని ఆర్డీఓ రాణి సుష్మిత సూచించారు. స్థానిక రెవెన్యూ డివిజినల్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై వచ్చిన అర్జీలను స్వీకరించారు. అదేవిధంగా జర్నలిస్టులకు భద్రత కల్పించాలని స్థానిక జర్నలిస్టులు ఆర్డీఓకు వినతిపత్రం అందజేశారు. వ్యవసాయ శాఖ ఏడీ యల్లప్ప, సీడీపీఓ లక్ష్మీప్రసన్న, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ షాన్‌వాజ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

సవరణ చేసిన ఓటరు జాబితా ఇవ్వండి

రాయదుర్గం రూరల్: నాలుగైదు నెలలుగా మార్పులు, చేర్పులు, తొలగింపులు చేసినా , తప్పుల తడకగా ఉన్న పాత ఓటరు జాబితాను విడుదల చేయడంలో ఆంతర్యమేమిటని అఖిలపక్ష నాయకులు తహసీల్దార్ ఓబుళేసును ప్రశ్నించారు. పలువురు ఓటర్లు ఫాం 6,7,8 ఇచ్చినా.. ఎందుకు సవరణలు చేయలేదన్నారు.

'ఐసీహెచ్' ఆముదంతో అధిక దిగుబడి

కళ్యాణదుర్గం: ఐసీహెచ్ –66 రకం ఆముదంతో అధిక దిగుబడులు సాధించవచ్చని కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ సి.రాధాకుమారి సూచించారు. ప్రథమ శ్రేణి ప్రదర్శనలో భాగంగా సోమవారం మండలంలోని దాసంపల్లిలో రైతు జైపాల్ రెడ్డి సాగు చేసిన కొత్త రకం ఆముదం పంటను శాస్త్రవేత్తలతో కలసి ఆమె పరిశీలించారు. ప్రస్తుతం క్వింటాల్ ధర రూ.5500 ఉందని, ఎకరాకు మంచి దిగుబడి వస్తే రూ.40 వేల నుంచి రూ.44 వేల వరకూ ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు బాలాజీ నాయక్, మల్లికార్జున, యుగంధర్‌లతో పాటు రైతులు రవి, నాగేంద్ర, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆముదం పొలాల్లో పంటకోత ప్రయోగాలు

ఉరవకొండ: మండలంలోని పెద్ద కొకుంట్ల గ్రామ సమీపంలోని ఆముదం పొలాల్లో సోమవారం పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. ఏడీఏ పద్మజ, వ్యవసాయ శాఖ అధికారి శుభకర్ పర్యవేక్షించారు.